శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



## జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్

**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు అనంతరం జిల్లాలో ఎటువంటి విధ్వంసక చర్యలు జరగకుండా ముందస్తుగా నెల్లూరు జిల్లా మొత్తం కూడా 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న శాంతి భద్రతల దృష్ట్యా, ప్రజా జీవనానికి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు, అలాగే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు భద్రతా చర్యలలో భాగంగా నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నామని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి సభలు, ర్యాలీలు నిర్వహించరాదని, నలుగురికి మించి బహిరంగ ప్రదేశాలలో గుమిగూడరాదని, నిబంధనలను అతిక్రమించిన యెడల చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు వారికి జిల్లా ప్రజలు ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు.

## కామాక్షితాయి సేవలో డిప్యూటీ కమీషనర్



**బుచ్చి సెప్టెంబరు 9 ప్రభాతవార్త** శ్రావణ మాసం పురస్కరించుకొని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి,కామాక్షితాయిని గుంటూరు జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమీషనర్ హేమంత్ నాగరాజు దంపతులు శనివారం దర్శించుకున్నారు.ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రమణ్యంనాయుడు దంపతులు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు సాంప్రదాయం ప్రకారం వారిని స్వాగతించారు. వారి గోత్రనామలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అతిధులకు శ్రీవార్ల శేషవస్త్రములతో సత్కరించి తీర్ధ ప్రసాదాలు అందించారు.ఈకార్యక్రమంలో వారి వెంట బుచ్చిరెడ్డిపాలెం సెబ్ సిఐ సూర్యనారాయణ ,సిబ్బంది ఉన్నారు.

## ఉత్సాహంగా సాగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని నక్కలమిట్ట క్రీడా ప్రాంగణంలో అట్లూరి సుబ్రహ్మణ్యం మెమోరియల్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శనివారం జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో షాహుల్-11 125 పరుగులు చేయగా.. ఎస్ఎంసీ -11 80 పరుగులు చేసి ఓటమి పాలైంది. ఈ బ్యాచ్‌లో షాహుల్-11కి చెందిన నానికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందజేశారు. అదేవిధంగా పల్లిపాడు-11 .. 119 పరుగులు చేయగా రాణా-11 45 పరుగులు చేసి ఓటమి పాలైంది. పల్లిపాడు -11లోని సుబ్బుకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని నిర్వాహకులు అందజేశారు.

## కోనలో వైభవంగా నృసింహుని నిత్య కళ్యాణం



**పెంచలకోన(రాపూరు), సెప్టంబరు9 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేకంగా అబిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులు, వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మద్య స్వామి వారి కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని ప్రత్యేకంగా ఆలంకరించి తిరుచ్చిపై వుంచి బోయిలు మొసుకుంటూ వచ్చి స్వామి వారి సహస్ర దీపాలంకరణ మండపంలో వుంచి వేదపండితులు స్వామి వారికి ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి,ఇఓ జనార్ధన్ రెడ్డి, వర్యవేక్షించారు.

## చంద్రబాబు అక్రమ అరెస్టు అప్రజాస్వామికం



**నెల్లూరు,సెప్టెంబరు9 ప్రభాతవార్త-విద్య** మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయటం అప్రజాస్వామికమని జనసేన జిల్లా అద్యక్షులు మనుక్రాంత్‌చెనా ్నరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని స్థానిక పార్టీ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అరెస్టును తాము తమ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆయనను ఆరెస్టు చేసిన విధానం చాటా కలచి వేసిందని, చంద్రబాబుకు తమ పార్టీ తరపున పూర్తి మద్దతును ప్రకటిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో జగన్ ముఖ్యమంత్రి అయిన నాటి నుండి రాక్షస పాలన సాగుతుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రజాస్వామం కనిపించటం లేదన్నారు. ప్రభుత్వ అసమర్ధతతను ఎత్తి చూసి ప్రజా సమస్యలను పరిష్కరించేలా చేయటమే ప్రతిపక్ష పార్టీల పని అని గుర్తుచేశారు.దీనిని తట్టుకులేక ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రభుత్వ అసమర్ధతతను ఎత్తి చూపిన వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయటం, వారిని ఆర్ధికంగా చిన్నా బిన్నం చేయటం,బెదిరించటం దాడులుడు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేఖంగా గోంతు ఎత్తితే దాడులు, అక్రమ అరెస్టులు పరిపాటిగా మారాయన్నారు. ప్రజా వేదిక కూల కొట్టడం దగ్గర నుండి ముఖ్యమంత్రి రాక్షస పాలన ప్రారంభమైందన్నారు. అలాగే తమ అధినేత పవన్‌కల్యాణ్‌కు కూడా అనేక మార్లు ఇబ్బందులకు గురి చేశారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి, ఆయన అనుచరులు, వైకాపా నాయులు అనేక అరాచకాలు చేసి బయటే తిరుగుతున్నారని, జనసేన, తెలుగుదేశం నాయకులను మాత్రంహౌస్ అరెస్టులను చేస్తూ భయభ్రాంతులకు గుర్తిచేస్తున్నారన్నారు. మూడు సంవత్సరాల కిందన నమెదు చేసిక కేసుకు చార్జిషీటు వేయకుండా ఇప్పుడు అరెస్టు చేయటం నీతిమాలిన రాజకీయమని దుయ్య బట్టారు. దాదాపు 33 కుసుల, 16నెలలు జైలు జీవితం గడిపి వ్యక్తికి అధికారం ఇస్తే పరిస్థితి ఇలానే ఉంటుందన్నారు. అనంతరం నగరఅధ్యక్షులు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు మాట్లాడు ఏడు పదుల వయస్సులో ప్రజల కోసం పాటుపడుతున్న చంద్రాబును అరెస్టు చేసిన తీరు తమను తీవ్రంగా కలచి వేసిందన్నారు. రౌడీ షీటర్లు, గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్స్ లాగా ఆయనను అరెస్టుచేసి కార్లు మార్చుకుంటూ విజయవాడ తీసుకువెళ్లడం సిగ్గుచేటన్నారు. వెంటనే ఆయనను విడుదల చేయ్యాలని కోరారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలాయా, కంతర్, సుల్తాన్, ఇంతియాజ్, ప్రవీన్, సాయి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను సందర్శించిన ప్రవాసభారతీయులు

**మర్రిపాడు,సెప్టెంబర్9,ప్రభాతవార్త:** మండలంలోని కదిరినాయుడుపల్లికి చెందిన ప్రవాసభారతీయులు డాక్టర్ రామిరెడ్డి, ఓబులురెడ్డి, డాక్టర్ సుమిత్ర, వారి కుమార్తెలు డాక్టర్అర్చన, డాక్టర్ హరిణి, అల్లుళ్ళు డాక్టర్ కెల్విన్, క్రిష్‌లు కదిరినాయుడుపల్లి ఉన్నతపాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సుజాతమ్మ చారిటబుల్‌ట్రస్ట్ , రామిరెడ్డి గంగిరెడ్డి-రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పాఠశాలకు, విద్యార్థులకు అందుతున్న సేవా కార్యక్రమాలను సమీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా విద్యాదానం గొప్పదని , విద్యద్వారానే మంచి సమాజాన్ని నిర్మించగలమని , ఈప్రాంత విద్యాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందించడానికి ఎప్పటికీ ముందుంటామన్నారు. ప్రధానోపాధ్యాయుడు రవి మాట్లాడుతూ ఈ ట్రస్ట్‌ల సేవలు అమోఘమని ఎంతోమంది విద్యార్థులు గొప్ప స్థాయికి ఎదిగారని ఈప్రాంత ప్రజలు రామిరెడ్డి, ఓబులురెడ్డి వారి సోదరులకు రుణపడి ఉంటారన్నారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు వారిని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ సూర్యారెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, ఉపాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జొన్నవాడ దేవస్థానం ఇఒగా గిరికృష్ణా



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడ శ్రీమల్లికార్జునస్వామి ,కామాక్షితాయి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వి.గిరికృష్ణ బాద్యతలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రమణ్యంనాయుడు, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు గిరికృష్ణను శాలువాలతో కప్పి పూలమాల వేసి స్వాగతించారు.ఈ సందర్బంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# టీడీపీ నేతల అరెస్టులు





**నెల్లూరు సెప్టెంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడుని తెల్లవారుజామున నంద్యాల్లో శనివారం అరెస్టు చేశారు. ఈ క్రమంలో నెల్లూరు నగర, రూరల్‌లోని ప్రముఖ టీడీపీ నాయకులను గృహనిర్బంధం చేశారు. అల్లర్లు లేకుండా ముందస్తుగా టీడీపీ నేతలను, కార్యకర్తలను గృహనిర్బంధం చేశామని పోలీసులు చెప్పుకొస్తుంటే తమ నాయకుడిని అక్రమంగా అరెస్టు చేయడమే కాకుండా, తమను కనీసం నిరసన గళం విప్పేందుకు కూడా లేకుండా మమ్మల్ని గృహనిర్బంధం చేయడం ఏమిటని టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లాస్థాయి నేతలు అనే తేడా లేకుండా అరెస్టుల పర్వం కొనసాగింది. కార్పొరేటర్లను సైతం వాళ్ళవాళ్ళ గృహాలు నిర్బంధాలు చేశారు. రూరల్ నియోజకవర్గంలోని అల్లీపురంలో తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీమంత్రి పొంగూరు నారాయణను చింతారెడ్డిపాలెంలోని నారాయణ మెడికల్ కళాశాలలోని ఆయన నివాసంలో గృహనిర్భంధించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నారాయణలు మాట్లాడుతూ చంద్రబాబునాయుడుని అరెస్టు చేయడం దారుణమన్నారు. కావాలనే ఒక నాటకీయ పరిణామాలను పోలీసులు సృష్టిస్తూ తెల్లవారి 5.30గంటలకు అరెస్టు చేశారన్నారు. ఈ క్రమంలో అరెస్టుకు సంబంధించి ఎఫ్ఐఆర్, దానికి సంబంధించిన ఆధారాలను చూపమన్నా చూపకుండా పోలీసులు ఆయనను నిర్బంధించి విజయవాడకు తరలించడం హేయమైన చర్యన్నారు. చంద్రబాబు, టీడీపీపై ప్రజలలో వస్తున్న స్పందనను చూసి ఓర్వలేక జగన్ ఫ్రస్టేషన్‌లో ఇలాంటి ఆకృత్యాలకు ఒడిగడుతున్నాడన్నారు. లోకేష్, చంద్రబాబునాయుడులు ఎక్కడ కార్యక్రమాలు చేపడుతున్న సమయంలో ప్రజలు స్వచ్ఛంధంగా వాళ్ళకై వాళ్ళే వచ్చేస్తున్నారన్నారు. రీసెంట్‌గా నేషనల్ సర్వేలో ఒక రిపోర్టు చూస్తే ఒంటరిగా టీడీపీ పోటీ చేసినా తిరుగులేని మెజార్టీతో గెలుస్తుందని వెల్లడించిందన్నారు. ఎవరు ప్రశ్నించినా వారిని అరెస్టు చేయడమే పనిగా జగన్ చేస్తున్నాడన్నారు. ప్రజా సమస్యలను గాలికొదిలేశాడని, త్వరలోనే ప్రజలే ఆయనకి బుద్ధి చెపుతారని వారు హెచ్చరించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గృహనిర్బంధంలో ఉంచాలని పోలీసులు ప్రయత్నించగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తన నివాసంలో లోపలికి పోలీసులు రావడంతో శ్రీధర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. తన నివాసం గేటు బయట ఉండాల్సిన పోలీసులు లోపలికి రావడంపై తీవ్ర అభ్యంతరాన్ని తెలిపాడు. లోపలికి వస్తే ఒక్కొక్క పోలీసు అధికారి కోర్టులు చుట్టూ తిరగాల్సి వస్తుందని శ్రీధర్‌రెడ్డి హెచ్చరించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా మీరు నా నివాసంలోకి ఏలా వస్తారని పోలీసులను ఆయన నిలదీశాడు. నా నివాసంలోకి వచ్చేందుకు నువ్వెరంటూ ప్రశ్నిస్తూండగా పోలీసు దబాయింపు ధోరణికి పాల్పడడంతో ఒక్కసారిగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎదురుతిరిగి ఎందుకు నన్ను దబాయిస్తున్నావంటూ నిలదీశాడు, నోటీసులు లేకుండా నా నివాసంలోకి వచ్చి మా ఇంట్లోని ఆడవాళ్ళని దబాయిస్తావాని పోలీసులను గదమాయించి, ముందు మీరు గేటుకు బయటకి పొమ్మని పోలీసులను హెచ్చరించడంతో పోలీసులు కిమ్మనకుండా బయటకు వెళ్ళారు. ఈ తరుణంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం గేటు వద్ద శ్రీధర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలతో నిరసన తెలుపుతూ భైఠాయించారు. ఆ తరువాత పోలీసులు ఆయనకు నోటీసులు ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ చంద్రబాబునాయుడుని అరెస్టు చేసి జిల్లాలోని నేతలను అరెస్టులు చేయడంతో శనివారం ఆయన నివాసంలో విలేఖరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంటు కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబునాయుడుని ఏ చట్టప్రకారం అరెస్టు చేశారని, స్కిల్ డెవలప్‌మెంటు పెద్ద కుంభకోణం అని ఏవిధంగా అంటారని స్వయంగా హైకోర్టు చేప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఎఫ్ఐఆర్ రిజిస్ట్రేషన్ చేసిన 18నెలలకు విచారణ అధికారులు లేకుండా కోర్టు నుంచి కనీస అనుమతి తీసుకోకుండా డిఐజీ స్థాయి అధికారి ఏ చట్ట ప్రకారం అరెస్టు చేశారని ఆయన ప్రశ్నించారు. 2021 ఏడాదిలో నమోదైన ఎఫ్ఐఆర్‌కి ఇంతవరకు ఎలాంటి చార్జ్‌షీటు ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ఆ కేసులో ఎలాంటి కుంభకోణం జరగలేదనటానికి అందులో శిక్షణ పొందిన 2.13లక్షల మంది విద్యార్థులే ప్రత్యక్షసాక్షులన్నారు. ఆయన 16నెలల్లో జైల్లో ఉన్నారని చంద్రబాబునాయుడుని కనీసం 16 నిమిషాలైనా జైల్లో పెట్టాలన్నదే తన జీవిత లక్ష్యం అన్నట్లు జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధిస్తున్నారని ఆరోపించాడు. ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, దీనిపై న్యాయపోరాటం చేస్తామని ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామన్నారు. చంద్రబాబునాయుడుని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ధ్వజమెత్తారు. శ్రీనివాసులురెడ్డిని నిర్భంధంలో ఉంచిన తరుణంలో వినూత్నరీతిలో ఆయన జగన్‌మోహన్‌రెడ్డి ఫోటో ఉన్న చిత్రపటాన్ని దగ్ధం చేశారు. ఈ సందర్భంగా విలేఖరులతో ఆయన మాట్లాడుతూ జగన్ నీ తండ్రే చంద్రబాబుని ఏమి చెయ్యలేకపోయాడని నువ్వేం పీకలేవన్నాడు. చంద్రబాబు మీద ఎన్ని కేసులు పెట్టినా ఒక్కటి కూడా నిరూపించలేక పోయ్యావన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో రాష్ట్ర ప్రజలు అందరు ఆగ్రహంతో ఉన్నారని ఆయన అన్నారు. చంద్రబాబుని వెంటనే బేషరతుగా విడుదల చేసి జగన్ క్షమాపణ చెప్పాలని శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. నిర్భంధంలో ఉన్న నాయకులను గృహాల నుండి బయటకు రాకుండా పోలీసులు పరహారా కాస్తున్నారు.



## లోక్‌అదాలత్‌లో 1186 కేసులు పరిష్కారం




**కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 1186 కేసులు పరిష్కారమయ్యాయని కావలి సీనియర్ సివిల్ జడ్జి, లోక్‌అదాలత్ చైర్మన్ యం.శోభ తెలిపారు. కావలి సబ్‌కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌కు ముఖ్యఅతిధిగా సీనియర్ సివిల్ జడ్జి శోభ హాజరై మాట్లాడారు. కోర్టులో పెండింగ్‌లో వున్న కేసులు, ఖర్చు కాలయాపన లేని అంతిమ తీర్పును, అలాగే ఇరు పార్టీల వారు లోక్‌అదాలత్‌లో సమన్యాయం పొందవచ్చునని తెలిపారు.ఈ లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు అన్ని కలిపి సుమారు 1186 కేసులు పరిష్కారయ్యాయని తెలిపారు. అలాగే సుమారు కోటి రూపాయల నగదును పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి, స్పెషల్ మేజిస్ట్రేట్ పరుశురాం, కావలి న్యాయవాద సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఐ.వి.రామిరెడ్డి, జయప్రకాష్, న్యాయవాదులు శ్రీనివాసులురెడ్డి, వేణుగోపాలరెడ్డి, కలీం రోజ్‌దార్, కెన్నెడీ, సురేంద్రరెడ్డి, సుబ్బానాయుడు, సాయిప్రసాద్, శ్రీదేవి, సునీల్‌కుమార్‌సింగ్, జూనియర్ న్యాయవాదులు, లోక్‌అదాలత్ సభ్యులు యం.మాలకొండారెడ్డి, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## బలిజ కులస్తుల భవన శంకుస్థాపన బలిజలే చేయాలి



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్, సీపీఎం ఆఫీసు ప్రాంత సమీపంలో బలిజ కులంలోని పెద్దలు దూర దృష్టితో బలిజలకి ఒక కమ్యూనిటీ హాల్ ఉండాలని ఉద్దేశంతో రూపాయి రూపాయి కూడా పెట్టి ఒక స్థలం కొనుగోలు చేశారని, ఆ స్థలంలో శంకుస్థాపనను వేరే కులం వారిచేత కాకుండా బలిజ కులస్తులచేతనే చేయించాలని పట్నం గిరిజమ్మ, బీవీ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ డీవీఎస్ గిరి ఆ స్థలంలో ఆదివారం భూమి పూజ ఉందని ప్రకటన చేయడం పట్ల వేము మిమ్ములను ఒక మాట అడగలదలిచామని మీకు ఏ మాత్రం సిగ్గుందా..? నైతిక విలువలు ఉన్నాయా..? ఉంటే నెల్లూరు నగరంలో ఎంతో మంది బలిజకుల పెద్దలు ఉండగా వేరే కులస్తుల చేత శంకుస్థాపన చేయించాలన్న నీ ఉద్దేశం నీచమైందన్నారు. బలిజ కులస్తుల మనోభావాలు దెబ్బతినేలా చేస్తున్నారని విమర్శించారు. గతంలో డాక్టర్ పొంగూరు నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో ఒక చేతిలో వాటర్ బాటిల్ మరో చేతులో టవల్ పెట్టుకుని ఆయన వెంట తిరుగుతూ బలిజలందరూ నా వెంట ఉన్నారని చెప్పుకుంటూ నీ స్వార్ధ ప్రయోజనాన్ని చెక్కబెట్టుకునావు తప్ప , నువ్వు బలిజ కులస్తులకు చేసింది ఏమి లేదన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే నారాయణకి వెన్నుపోటు పొడిచి నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ వద్దకు చేరేవని వివరించారు. ఎవరైనా ఏ రాజకీయ పార్టీలైనా చేరవచ్చు తప్పులేదు అయితే ఇప్పుడు నీ స్వార్ధ రాజకీయ ఆర్ధిక ప్రయోజనాలకి కులాన్ని తాకట్టు పెట్టవద్దని హితవు పలికారు. నీకు బుద్ధి ఉందా గత ప్రభుత్వంలో పొంగూరు నారాయణ మంత్రిగా ఉన్న సమయంలో బలిజ కాపు భవనానికి మూడున్నర ఎకరా స్థలాన్ని కేటాయించి సొంత నిధులు కోటి రూపాయలు విరాళంగా ఇచ్చి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం ప్రభుత్వం మారటం కొత్త ప్రభుత్వాన్ని మన కుల పెద్దలు అందరూ కలిసి పనులు పూర్తి చేయమని కోరగా పూర్తి చేయడం జరిగిందన్నారు. కాపు భవన్ ప్రభుత్వం ఆదీనంలో ఉంది కనుక ప్రభుత్వ ప్రొటోకాల్ ప్రకారం ప్రారంభించారని పేర్కొన్నారు. గాదిరాజు అవోక్‌కుమార్ మాట్లాడుతూ మనం మన కులస్తులం అందరిని పిలవలేకపోయామని, కలిసికట్టుగా ప్రారంభించుకోలేకపోయామనే బాధ ఉందని, అయితే బలిజలకు మాత్రమే హక్కు ఉన్నటువంటలి స్థలంలో బలిజలు మాత్రమే శంకుస్థాపన చేయాలని స్పష్టంగా చెప్పారు. డీవీఎస్ గిరి మీరు వేరే కులస్తుల వారిని తీసుకొచ్చి శంకుస్థాపన చేయించాలని చూస్తున్నావు ఇది మీకు మంచి పద్దతి కాదని హెచ్చరించారు. ఇకనైనా బుద్ధి తెచ్చుకో, ఇలాంటి చర్యలు మానుకోవాలని హెచ్చరించారు.

# రాష్ట్ర విద్యారంగంలో సమూల మార్పులు

### -డిజిటల్ టీచింగ్‌పై ప్రత్యేక కసరత్తు
### -నాడు నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్పు
### -రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్



**నెల్లూరు,సెప్టెంబరు9 ప్రభాతవార్త-విద్య** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆధర్యంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావటం జరుగుతుందని రాష్ట్ర పాఠశాలల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు.శనివారం నగరంలోని కస్తూరిభా కళాక్షే త్రంలో నిర్వహించిన కెరియర్‌గైడెన్స్ అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకువిద్యార్థులకు ఉత్తమమైన విద్యను అందించటంలో భాగంగా డిజిటల్ టీచింగ్‌పై ప్రత్యేక కసరత్తు చేసిన అనంతరం విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు అందించటం జరిగిందన్నారు. సాదారణ యూట్యూబ్ లో వచ్చే ఎడ్యుకేషన్ వీడియోస్‌లో క్వాలిటి లేదని, అందుకే అత్యంత వ్యయప్రయాలకు ఓర్చి బైజూస్ సంస్థతో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే తలంపుతో ఈ ట్యాబ్స్ ఇవ్వటం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు బైజూస్‌కంటెంట్ పై అవగాహన కల్పించారు. విదేశీ విద్య, అక్కడ లబించే ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై ఆయన విపులంగా వివరించారు. అనంతరం కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ మాట్లాడుతు విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో రాణించినప్పుడే ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. అనంతరం తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు ప్రభుత్వం నాడు నేడు ద్వారా విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రతి విద్యార్ధి చదువుకోవాలనే వాంచతో అమ్మఒడి,నాణ్యమైన మధ్యాహ్న బోజనం, గోరుముద్ద , విద్యా కానుక, వసతి దీవెన, విదేశీ విద్య, లాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు సంపూర్ణ మద్దతు ఇస్తునా ్నమన్నారు. రానున్న రోజుల్లో మరింత ముందుకు విద్యను తీసుకువెళుతుంది అనటంలో సందేహం లేదన్నారు. తొలుత సరస్వతిమాత, సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటాలకు పూలమాలలు వేసినివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి సదస్సును లాంచనంగా ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖ అధికారి గంగా భవాని, సర్వశిక్ష పిఓ ఉషారాణి, డిప్యూటీ డిఈఒ, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం నాయకుల్ని హౌస్అరెస్టు చేయడం దారుణం



**సంగం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** తెలుగుదేశం నాయకులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేయడం దారుణమని సంగం మండలం తెలుగుదేశం నాయకులు గుళ్లపల్లి శ్రీనివాస్‌యాదవ్ ఖండించారు. శనివారం ఉదయం నుండి పోలీసులు ఆయనను హౌస్ అరెస్టు చేశారు.ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గతంలో తనను అరెస్టు చేసి జైలు పెట్టారని, ఎలాగైనా చంద్రబాబునాయుడ్ని కూడా అరెస్టు చేయించాలన్న కక్షతో అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలన నియతృత్వ పోకడాలకు కాలం దగ్గరపడిందని హెచ్చరించారు.చంద్రబాబు అక్రమ అరెస్టును ఉపక్రమించే వరకు తమ పోరాటం సాగదని హెచ్చరించారు.

## చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసన బుచ్చి టిడిపి నాయకుల ఆందోళన



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని అరెస్టు చేసినందుకు నిరసనగా బుచ్చిరెడ్డిపాళెంలో టిడిపి నాయకులు ఆందోళన చేశారు. కొంతమంది టిడిపినాయకులు వింజంరాము నాయుడు,దుగ్గిశెట్టి హరినాద్‌లోను పోలీసుల అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.పోలీస్‌స్టేషన్ ముందు టిడిపినాయకులు ఆందోళన చేశారు.ఈ సందర్భంగా జిల్లా టిడిపి బిసిసెల్ నాయకులు బత్తల హరికృష్ణా ఈ సందర్భంగా మాట్లాడుతు 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన నాయకుడు చంద్రబాబునాయుడ్ని వైసిపి ప్రభుత్వం పగబెట్టి అరెస్టు చేసిందని ఆయన విమర్శించారు. చంద్రబాబునాయుడికి నోటీసులు పంపించకుండా అత్యంత నాటకీయంగా ఆయనను అరెస్టు జగన్‌మోహన్‌రెడ్డి కక్ష తీర్చుకున్నాడని విమర్శించారు. ఎప్పుడో గడిచిపోయిన కేసులో ఇప్పుడు చంద్రబాబునాయుడ్ని అరెస్టు చేయడం చాలా దారుణమని ఖండించారు.ప్రజలు అంతా చేస్తున్నారని తగిన గుణపాఠం చెబుతారని బత్తల హరికృష్ణా హెచ్చరించారు.ఈకార్యక్రమంలో మైనార్టీనాయకులు షబ్బీర్,సర్దార్, సందానీ,అక్తర్, రఫీ, జావిద్, సుల్తాన్, జాకిర్, జాపర్, ఖాదర్‌బాషా,యువతనేత దశరద్,మాజీ ఎంపిటిసి చిలకాబాలకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపినేతలను హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామ్యకం



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తెలుగుదేశం నాయకుల్ని హౌస్ అరెస్టు చేయడం ఏమిటిని బుచ్చిరెడ్డిపాళెం తెలుగుదేశం నాయకులు మండిపడ్డారు. జిల్లారైతువిభాగం నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డిని, మండల పార్టీ అద్యక్షులు ఎం.వి శేషయ్యను, బండ్లకొండయ్యను హౌస్ అరెస్టు చేశారని టిడిపినాయకులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడ్ని కావాలని జగన్‌మోహన్‌రెడ్డి కక్షకట్టి సంబంధం లేని స్కిల్ డవలప్‌మెంట్ కేసులో చంద్రబాబునాయుడ్ని అరెస్టు చేయించారని నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డి కక్షసాధింపు చర్యలు,ఆయన అరాచ పాలన ప్రజలు చూస్తున్నారని తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## కలెక్టరేట్ వద్ద రెండో రోజుకు చేరిన రిలేదీక్షలు



**నెల్లూరు అర్బన్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరగబోవు అత్యవసర పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వం పైన కేంద్రంలో ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు ఎస్సీ వర్గీకరణపై ఒత్తిడిపెంచాలని చేస్తున్న దీక్షలు శనివారం నాటికి రెండో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని 9 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికి చేయకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ వర్షాకాల పార్లమెంటు సమావేశంలో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈనెల 22వ తేదీ వరకు జరుగు ఈ దీక్షలు జిల్లా స్థాయి నుంచి నియోజకవర్గ మండల స్థాయి వరకు జరుగుతాయని అన్నారు. దీక్షలకు మద్దతుగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, నాయకులు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ గోసాల సుధాకర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా కన్వీనర్ పందిటి అంబేద్కర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా కోకన్వీనర్ కోళ్లగట్ల రమేష్ మాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు తాళ్లూరు శేషయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు అక్కిలగుంట ఏసు మాదిగ, మంగళపూరి సురేష్ మాదిగ, బి.మనోహర్, ఎస్.పద్మ, కే.మణి, పెంచలయ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వలేటివారిపాలెంలో చంద్రబాబు అరెస్ట్‌కు నిరసన

**వలేటివారిపాలెం సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తెదేపా అధినేత మాజీముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా వలేటివారిపాలెంలో శనివారం తెదేపా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.చంద్రబాబు అరెస్ట్ నేపద్యంలో పోలీసుల ముందస్తుచర్యల్లో బాగంగా తెదేపా నేతలను అరెస్టు చేశారు. కందుకూరు తెదేపా ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు మరియు తెదేపా నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్‌లు స్వగ్రామము వలేటివారిపాలెం మండలంలోని బడేవారిపాలెం. దీంతో వారు ఎటువంటి నిరసన కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండెందుకు పోలీసులు వారి స్వగ్రామమైన బడేవారిపాలెంలోని వారివారి స్వగృహాల్లో శనివారం అదుపులోకి తీసుకున్నారు.దీనిని చాక్యచక్యంగా తిప్పికొట్టిన నేతలు నిరసన కార్యక్రమం నిమిత్తం కందుకూరు వెళ్లారు.నిరసన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా వలేటివారిపాలెం మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం అధ్యక్షతన మండల కేంద్రంలో నిరసన హోరెత్తించారు. బస్టాండు సెంటర్‌లో మానవహారం ఏర్పాటుచేసి సీఎం డౌన్ డౌన్ అంటూ నినదించారు.చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు మాదాల ప్రకటించారు. చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మినరసింహంతోపాటు తెదేపా నేతలు నవులూరి రాజారమేష్, గట్టమనేని చెంచునాయుడు, కాకుమాని హర్ష, కాకమాని ఆంజనేయులు, సాధు చెన్నకేశవులు అంకభూపాలపురం నేతలు పాల్గొన్నారు.

## ఉదయగిరి టిడిపినాయకుల ఆందోళన



**ఉదయగిరి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి మండలంలో తెలుగుదేశంపార్టీ జాతీయ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు అరెస్టుగా నిరసనగా ఉదయగిరి తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు ,అభిమానులు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఉదయగిరి బస్టాండ్ సెంటర్‌లో రాస్తారోకు నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువనాయకుడు శివకృష్ణా మాట్లాడుతు మండలంలోని తెలుగుదేశం పార్టీనాయకులందరిని నిరసనలు తెలుపకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేయడం ప్రజాస్వామ్యంలో హక్కులు కోల్పోయారని విమర్శించారు. వైసిపి పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని కప్పి పుచ్చుకునేందు చంద్రబాబునాయుడు అరెస్టు చూపించి ప్రజలని తప్పుదారి పట్టిస్తున్నారని రాబోయే రోజులలో వైసిపి ప్రభుత్వం నామరూపాలు లేకుండా పోతుందని తెలిపారు. ప్రజల పట్ల వైసిపి ప్రభుత్వం చేసిన అరాచకాలను ఎత్తి చూపిస్తు నారాలోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టారని చంద్రబాబునాయుడు ప్రజలలోకి వెళుతున్న తీరును వారిద్దరికి ప్రజల నుండి వస్తున్న అపూర్వస్పందనకు తట్టుకోలేక వైసిపి ప్రభుత్వం కక్షసాదింపు చర్యలకు దిగిందని విమర్శించారు.ఉదయగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బొల్లినేని రామారావు ఆదేశాల మేరకు ఆందోళన మరింత ఉదృతం చేస్తామని చంద్రబాబునాయుడ్ని అక్రమ అరెస్టు చేయించిన వైసిపి ప్రభుత్వం బేషరత్తుగా చంద్రబాబునాయుడ్ని విడుదల చేయాలని కోరారు.టిడిపి నిర్వహించిన ఆందోళన కార్యక్రమాన్ని పోలీసులు ఎక్కడిక్కడ నాయకుల్ని అరెస్టు చేసి రోడ్లపైకి ఎవ్వరు రాకుండా భారీ బందోస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపినాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టులో రాజకీయ ఉద్దేశం లేదు



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి అయిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడంలో ఎటువంటి రాజకీయ దురుద్దేశం లేదని, చట్టప్రకారమే అరెస్టు చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి అన్నారు. కోవూరులోని వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ అరెస్టుపై తెలుగుదేశం పార్టీ రాజకీయ అరెస్టు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2015 తర్వాత జరిగిన ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో కూడా మాట్లాడడం జరిగిందన్నారు. అసలు ఈ స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం కానీ, క్యాబినేట్‌లో తీర్మానం కానీ చేసిన దాఖలాలు లేవన్నారు. కేవలం ప్రభుత్వ సొమ్మును దోచుకోవడానికే ఈ స్కిల్ డెవలప్‌మెంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ విషయమై సీబీసీఐడీ, ఈడీ ప్రత్యేకంగా దర్యాప్తు జరిపి ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి కొంతమంది దోషులను కూడా అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారిచ్చిన సమాచారం మేరకే చంద్రబాబు నాయుడిని అరెస్టు చేశారే తప్ప ఇందులో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గానీ, పార్టీకి గానీ ఎటువంటి సంబంధం లేదన్నారు. ఈ స్కామ్‌లో సూత్రధారులైన అందరినీ విచారించి తగిన విధంగా శిక్షించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు విజయసేనారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిరంజీవి, సచివాలయ కన్వీనర్ ప్రసాద్, నేతలు శివకుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డిలు ఉన్నారు.

## వింజేటమ్మ ఆలయ అభివృద్ధికి అందరం భాగస్వాములమవుదాం



**వింజమూరు, సెప్టెంబర్9,ప్రభాతవార్త:** వింజమూరు పట్టణానికి నైరుతి దిక్కున కొండపై వెలసియున్న శ్రీ వింజపరమేశ్వరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికారిత కోఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వింధ్యపరమేశ్వరి ఆలయం ఎంతో ప్రాచీనమైనదని సుమారు 15వ శతాబ్ధానికి చెందిందని అలాంటి ఆలయఅభివృద్ధికిరాష్ట్ర ముఖ్యమంత్రి చూపిన చొరవ వెలకట్టలేనిదన్నారు. ఆలయం వింజమూరు ఫారెస్ట్ భాగంలో ఉండడంతో ఆలయ అభివృద్ధికి అనేక ఇబ్బందులుండేవని దాంతో భక్తులకు సౌకర్యాలు కల్పించలేకపోయామన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి అనుమతించడంతో ఆలయ అభివృద్ధికి నిధులను మంజూరు చేశారన్నారు. ఎకో టెంపుల్ టూరిజం 2.35కోట్లరూపాయలు మంజూరయ్యాయన్నారు. ఈనిధులతో రహదారి సౌకర్యం , అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కట్టడాల చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులతో ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల డిఎఫ్ఒ కింది స్థాయి అధికారులు అమ్మవారి ఆలయాన్ని సందర్శించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆమోదం తెలపడంతో పనులను శనివారం ప్రారంభించామన్నారు . ఈకార్యక్రమంలో పల్లాల కొండారెడ్డి, కరకల కొండారెడ్డి, డి.కొండారెడ్డి, చంద్రారెడ్డి, విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికం



**వింజమూరు,సెప్టెంబర్9,ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని అప్రజాస్వామిక విధానమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. శనివారం టిడిపి అధినాయకుడు చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను దృష్టిలో ఉంచుకొని టిడిపి నాయకులను పోలీసులు గృహనిర్బంధాలు, అరెస్ట్‌లు చేయడం దారుణమని టిడిపి నేతలు మండిపడ్డారు. శనివారం పాతబస్టాండ్ సెంటర్‌నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ ఆర్టీసి బస్టాండు రావడంతో హుటాహుటిన ఎస్ఐ కోటిరెడ్డి తన సిబ్బందితో అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీకి ఆదరణ పెరుగుతుందని , రానున్న ఎన్నికలలో వైకాపాకు ఓటమితప్పదనే భయం జగన్మోహన్‌రెడ్డికి పట్టుకుందన్నారు. అందులో భాగంగా నే గడిచిన రెండుమూడు సంవత్సరాలుగా ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ఖండిస్తుండడంతో టిడిపి నేతలపై కక్షసాధిస్తూ ఈప్రభుత్వం ఆనందపడుతుందన్నారు. అందులో భాగంగానే చంద్రబాబు నాయుడు ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండానే అరెస్ట్ చేశారన్నారు. సుదీర్ఘకాల ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నాయకుడిగా ప్రజలకోసం తపించే నాయకుడిని అరెస్ట్ చేయడం ప్రస్తుత ప్రభుత్వ దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో వైసిపికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. అరెస్ట్‌లతో దేశం నేతలను భయపెట్టాలని చూస్తే భయపడేదేలేదన్నారు. ఈకార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాధరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మెన్ దంతులూరి వెంకటేశ్వరరావ్, పట్టణ అధ్యక్షుడు కోదూరు నాగిరెడ్డి , మండల ఉపాధ్యక్షుడు గురజాల వాసునాయుడు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు,మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్‌లు కొండపల్లి వెంకటేశ్వర్లు, పాములపాటి మాల్యాద్రి, గణపం సుదర్శన్‌రెడ్డి,మండల ఐటిడిపి కోఆర్డినేటర్ ఆరికొండ శ్రీనివాసులు, మైనార్టీ యూనిట్ ఇన్‌చార్జ్ మహబూబ్‌బాషా, సీనియర్ నాయకులు ఖాజావలి, బూత్ కన్వీనర్ నీలం పెరుమాళ్ళు, ఖాజామస్తాన్, రైతు అధ్యక్షుడు ఏగినేని శ్రీనివాసులు, నాయకులు చెరుకూరు వెంకటేశ్వర్లు, అబ్దుల్ నబి, పెద్దేటి చెన్నయ్య, వేణుగోపాల్‌రాజు, బాసం ఎరుకలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'పేట'లో టిడిపి నాయకుల నిరసన



**అనుమసముద్రంపేట,సెప్టెంబర్9,ప్రభాతవార్త:** తెలుగుదేశంపార్టీ అధినేత , మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును అర్ధరాత్రి అరెస్ట్ చేయడంపై ఏఎస్‌పేట మండలానికి చెందిన టిడిపి నాయకులు శనివారం స్థానిక దర్గా సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పులిమి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ ఖాజామియా, మైనార్టీ నాయకులు షేక్ అబ్జల్, యస్దానిబాషా, షేక్ నజీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామపురంలో టిడిపినేతల అరెస్టు



**సీతారామపురం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** టిడిపినేత చంద్రబాబునాయుడి అరెస్టు నిరసిస్తు మండల టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు ఆద్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకొని నిరసన తెలుపుతున్న టిడిపినాయకుల్ని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. ఈ సందర్భంగా టిడిపి కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు మాట్లాడుతు వైసిపి ప్రభుత్వానికి ఓటమి బయం పట్టుకొని ప్రతిపక్ష నేత నారాచంద్రబాబునాయుడుపై కక్ష సాధింపు చర్యదిగి అక్రమకేసులు పెట్టారని ఆరోపించారు.ఎటువంటి కారణాలు చూపకుండా అరెస్టులు చేయడం దారుణమని ప్రజలందరు వైసిపి అవలంబిస్తున్న దుర్మార్గపు చర్యలను గమనిస్తు రాబోయే ఎన్నికలలో తగిన బుద్ధి చెబుతారని అన్నారు.యువనేత లోకేష్ యువగళం పాదయాత్రకు వస్తున్న విశేషస్పందన ప్రజలలో వైసిపి ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేఖతను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. ఈకారణంగానే టిడిపినేతలపై దాడులు,అక్రమ అరెస్టులు చేయిస్తు పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని అన్నారు. ఈకార్యక్రమంలో టిడిపినాయకులు వెంకటేశ్వర్లు,పెద్దగౌస్, జాషువా,కలెవెల బాలస్వామి, కలెవెల బాబు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నేతల ఆందోళన



**సంగం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :**చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తు సంగం మండలం అన్నారెడ్డిపాలెం జాతీయ రహదారిలో టిడిపి నాయకులు మెట్టు విజయకృష్ణారెడ్డి, నియోజకవర్గ మహిళా అద్యక్షురాలు మంజులానాయుడు నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే చంద్రబాబునాయుడ్ని బేషర్తుపై విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టిడిపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉదయగిరి ఎంపిడిఒగా ఈశ్వరమ్మ బాద్యతలు స్వీకరణ



**ఉదయగిరి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త:** ఉదయగిరి మండలంలో ఎంపిడిఒ కార్యాలయానికి నూతన ఎంపిడిఒగా ఈశ్వరమ్మ బాద్యతలు స్వీకరించారు. ఈమె ప్రకాశం జిల్లా సిఎస్‌పురం మండలంలో ఎస్ఒగా విధులు నిర్వహిస్తు సాధారణ బదలీలలో భాగంగా పదోన్నతిపై ఉదయగిరికి ఎంపిడిఒగా నియామకమైయ్యారు.ఈకార్యక్రమంలో ఆమె మాట్లాడుతు ఉదయగిరిలోని మౌళిక వసతులను ,సదుపాయాలను ఏర్పాటు చేసుకొని సిబ్బందితో ఉదయగిరి అభివృద్ది చెందే విధంగా ప్రణాళికలు సిద్దం చేసుకొని ముందుకు వెళతామని చెప్పారు.

## వ్యక్తం చేసిన దేశం నేతల అరెస్టు

**తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** మండలంలోని సౌత్ఆమూలూరు గ్రామంలో చంద్రబాబునాయుడు అరెస్టును ఖండిస్తూ తోటపల్లిగూడూరు టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు పైశాచిక ఆనందం పొందడం తప్ప వైసీపీ నేతలు సాధించేదేమి లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు జగన్ వైఖరిని గమణిస్తున్నారని, ప్రతిపక్షాలను అణగదొక్కాలని జగన్ చూస్తున్నారని, ఎన్ఎస్‌జీ భద్రత ఉన్న వ్యక్తి పట్ల వ్యవహారించే తీరు ఇదేనా అని రాజకీయ వ్యవస్థలో అందరూ దీనిని ఖండించాలన్నారు. ఈ నిరసన వ్యక్తం చేసిన కొంతమంది టీడీపీ పార్టీ నేతలను పోలీసులు అరెస్టులు చేశారు.

## మర్రిపాడులో టిడిపి నాయకుల నిరసన



**మర్రిపాడు, సెప్టెంబర్9,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన మర్రిపాడు సెంటర్‌లో జాతీయ టిడిపి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ మర్రిపాడు మండల టిడపిఇ కన్వీనర్ ఆరికట్ల జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసి బస్సులను నిలమని నారా చంద్రబాబునాయుడు చెప్పకపోయినా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్వలాభం కోసం ప్రయాణీకులు ఇబ్బందిపడే విధంగా నాటకాలు చేస్తున్నారని, ఇతని బూటకాలు ఇంకెన్ని రోజులు సాగవని తొందర్లోనే ముఖ్యమంత్రికి అర్థమవుతాయన్నారు. స్థానిక ఎస్ఐ విశ్వనాధరెడ్డి టిడిపి మండల నాయకులను అరెస్ట్ చేయడంపై అధికారుల ఆదేశాలతో కొన్ని షరతులతో వారిని విడిచిపెట్టారు. ఈకార్యక్రమంలో బాట మాజీ ఎంపిటిసి సభ్యులు రంతు, వెలగాల వెంకటేశ్వర్లు, రామచంద్రయ్య, పి.శ్రీనివాస్‌నాయుడు, శాఖాపురం సురేష్, చంద్రబాబు, వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు , ఎన్‌టిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## రాపూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు హౌస్ అరెస్ట్



**రాపూరు,సెప్టంబరు9ప్రభాతవార్త:** రాష్ట మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతియ ఆధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును శనివారంకర్నూలు జిల్లాలో రాష్ట సిఐడి పోలీసులు అరెస్ట్ చేసిన సందర్బంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండారాపూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులను శనివారం తెల్లవారుజామునుండి ఇళ్లలోనుండి బయటకు రానివ్వకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. టిడిపి మండల పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డిని జోరేపల్లిలోని ఆయన నివాసంలో పోలీసులు ఇంటినుండి రానివ్వకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, తిరుపతి పార్లమెంటు మైనారిటీ ఉపాధ్యక్షుడు షేక్ ముక్తియార్ తదితర నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ రాపూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు ధర్నా చేయాగా రాపూరు ఇన్‌చార్జ్ ఎస్ఐ పత్తిపాటి అనూషా నాయకులను అరెస్ట్ చేసి రాపూరు స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వారిని విడుదల చేశారు.

## బోగోలులో టిడిపి నేతల హౌస్ అరెస్ట్



**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా ఆందోళన కార్యక్ర మాల్ని చేపట్టకుండా మండల టిడిపి నేతల్ని శనివారం బిట్రగుంట పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా టి డిపి మండల పార్టీ అధ్యక్షులు యం. నాగేశ్వర రావు విలేకర్లతో మాట్లాడు తూ తమ పార్టీ అధ్యక్షులుని అక్రమం గా రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపుతో అరెస్ట్ చేసిందని ఆరోపించారు. ఇటు వంటి అరెస్ట్‌లు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో చీకటి రోజుగా అభివర్ణించారు. ప్రశ్నించే నేతల్ని, ప్రతిపక్ష నేతల్ని అరెస్ట్ చేయడం, వారిపై దాడులు చేయడం ఈ ప్రభుత్వానికి తగదని త్వరలో ధర్మమే గెలుస్తుందని ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. మాలేపాటి నాగేశ్వరరావు ఇంట్లో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, జిల్లా పార్టీ కార్యదర్శి కోడూరు వెంకటేశ్వరరెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షులు ఎర్రం వెంకటేశ్వరరెడ్డి తదితరులు వున్నారు.

**ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమాన సంఘం ఖండన...** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి రాజకీయ కక్షతో అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని కావలి డివిజన్ ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షులు భీమవరపు మధు ఒక ప్రకటనలో ఖండించారు. తెలుగు దేశం పార్టీకి వస్తున్న ఆదరణ చూసి అక్కసుతోరాష్ట్ర ప్రభుత్వం కక్షసాధింపు, కవ్వింపు చర్యలకు పాల్పడటం దారుణమని తెలిపారు.

**ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయం...**రాష్ట్రంలో వైసిపి అధికా రంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యం అపహాస్యమైందని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లి ఆరోపించారు. ప్రశ్నించే గొంతులను, ప్రతిపక్ష పార్టీల నేతలను టార్గెట్‌గా చేసుకొని వారిపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టడం దారుణమని దుయ్యబట్టారు. రాష్ట్ర చరిత్రలో ఇటువంటి సంఘటనలు దురదృష్టకరమని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు.

## పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యుడు హౌస్ అరెస్ట్



**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** బోగోలు మండలం బోగోలు పంచాయతీలోని చెంచులక్ష్మీ పురం గ్రామంలో శనివారం పిఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ సోదరుడు పసుపులేటి వెంకటేశ్వర్లను బిట్రగుంట పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. దగ దర్తి మండలం దామవరం విమానాశ్రయ భూ ములలో అక్రమంగా గ్రావెల్ తరలింపుపై గత రెండు రోజులుగా ఆందోళన చేస్తూ టిప్పర్లను అడ్డుకుంటున్నందుకు ముందస్తు చర్యగా అతనిని అదుపులోకి తీసుకున్నారు. పసుపులేటి వెంకటేశ్వర్లు విలేకర్లతో మాట్లాడుతూ హౌస్ అరెస్టులు చేసినంత మాత్రాన గ్రావెల్ తరలింపుని అడ్డుకునేది ఆపే ప్రసక్తే లేదన్నారు. అధికార పార్టీ నేతల బెదిరింపులకు తాము తలొగ్గే ప్రసక్తే లేదని దీనిపై ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## చంద్రబాబు అక్రమ అరెస్ట్ పై టిడిపి ఆందోళన

**వరికుంటపాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి ,తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమంగా ,అన్యాయంగా వైసిపి రాజకీయ కుట్రలో భాగంగా ఆరెస్ట్ చేయడం దుర్మార్గపు చర్య అనీ వరికుంటపాడు మండల పార్టీ అధ్యక్షులు చంద్రా మధుసూధన్‌రావు అన్నా రు.చంద్ర బాబు నాయుడు అరెస్ట్ చేశారనే కారణంతో ఎక్కడా టిడిపి నేతలు నిరసన తెలుపుతారనే కారణంతో వరికుం టపాడు మండలంలో తెలుగుదేశం నేతలను పోలీసులు ఎక్కడిఅక్కడే గృహ నిర్బంధాలు చేపట్టడంతో పాటు ,సెంటర్ లో ఉన్న టిడిపి కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.అయినప్పటికీ పోలీసులు కళ్ళుగప్పి టిడిపి మండల అధ్యక్షుడు చంద్రా మధుసూధన్‌రావు నేతృత్వంలో మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్ యాదవ్ ,తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మినారాయణలు తమ అనుచరులు ,కార్యకర్తలు ,నేతలతో కలిసి వరికుంటపాడు సెంటర్ కు బైక్ ర్యాలీగా ఒక్కసారిగా దూసుకురావడంతో ,ముందు గానే అక్కడక్కడా దాక్కోని ఉన్న నేతలు కూడా సెంటర్ కు రావడం ,ముఖ్యమంత్రి డౌన్ - డౌన్ అంటూ,సైకో పోవాలి- సైకిల్ రావాలీ అంటూ ,పోలీసులు జులుం నశించాలీ అంటూ నినాదాలు చేసూకుంటూ ఒక్క ఉదుటన చేరుకొని 565 వ జాతీయ రహదారి పై బైటాయించి నిరసన తెలుపడం,రోడ్ల పై వెళ్తున్న వాహనాలను ఆపడం నిమిషాలలో జరగడంతో ఏమి జరుగుతుందో పోలీసులకు సైతం అర్థం కాలేదు ,తేరుకున్న పోలీసులు టిడిపి కార్యకర్తలను అడ్డుకునే ప్రయాత్నం చేయగా కార్యకర్తలు పోలీసులు జులుం నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేసారు.రోడ్డు పై అడ్డంగా పడుకోని వాహనాలను ఆపివేయడం తో పాటు ,కార్యకర్తలు దుఖానాలను సైతం మూసి వేయించారు.ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ చంద్రా మధుసూధన్‌రావు మాట్లాడుతూ ఈ దొంగల రాజ్యంలో అరాచక పాలన సాగిస్తూ ఎఫ్ఐఆర్ లో పేరు కూడా లేని మచ్చ లేని మా నాయకుడిని అన్యాయంగా అరెస్ట్ చేయడం కక్ష్యసాధింపు చర్య అనీ ,జగన్ ఆనాడు జైలుకు పోయాడు కాబట్టే నేడు మా నాయకుడి కి కూడా అవినీతి మరకలు అంటించడానికి పోలీసులను,సిఐడి వాళ్ళను అడ్డం పెట్టుకొని అర్ధరాత్రి అరెస్ట్ చేయించడం జగన్ నీచపురాజకీయాలకు నిదర్శనం అని ఎద్దేవా చేశారు.ఈ రౌడీ రాజ్యానికి ప్రజలు ముగింపు పలకాలనీ పిలుపునిచ్చారు.అనంతరం 40 మంది టిడిపి నేతలను ఎస్సై విజయ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.మండలంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.ఈ నిరసనలో టిడిపి నేతలు చంద్రా వెంకయ్య,పోకా మహేష్,తెల్లగొర్ల వెంకటయ్య,నాదెండ్ల రాజా ,మానం కొండలరావు,నందిపాటి ఆరోన్,లాబాన్,మహిళ నేతలు మాగంటి శాంతమ్మ,అరుణ ,భాగ్యలక్ష్మి మండలంలోని అన్ని గ్రామాల నేతలు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## చంద్రబాబు అరెస్ట్‌పై జలదంకి టి.డి.పి నిరసన

**జలదంకి, సెప్టంబర్9, ప్రభాతవార్త:**మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడి అరెస్ట్‌కు నిరసనగ మండలకేంద్రమైన జలదంకిలో శనివారం ఆపార్టీనేతలు నిరసనకు దిగారు.ఉదయం పార్టీ అధ్యక్షుడు పులిగుంట మధురెడ్డి ఆధ్వర్యంలో మండల ప్రధానకార్యదర్శి మందపల్లి మాల్యాద్రి,ఏగూరి రఘు పిడుగు రమణయ్య తిరుమలరెడ్డి తదితర నాయకులు కార్యకర్తలు స్తానిక పార్టీ కార్యాలయంనుంచి జెండాలు చేతపట్టి నినాదాలు చేసుకుంటు ప్రదర్శనగ కెయు రోడ్‌పైకి వచ్చారు.అక్కడనుంచి తహసిల్‌దార్ కార్యాల కూడలినుంచి హరిజనపాళెంవైపు బయలుదేరారు.టి.డి.పి నేతలు రోడ్‌పైకి వచ్చారన్న సమాచారంతో ఎస్.ఐ ఆదిలక్ష్మి తన సిబ్బందితో హుటాహుటిన వారు వెళుతున్న ప్రాంతానికి చేరుకొన్నారు.పోలీసుల రాకను గమనించిన నేతలు రోడ్‌పై బైటాయించారు. అనుమతి లేకుండ నిరసనకు దిగడం చట్టరీత్యానేరం అంటు నచ్చజెప్పే ప్రయత్నంచేశారు.అయినప్పటికి వారు వినకుండా ఎస్.ఐతో వాగ్వివాదానికి దిగారు.మేంశాంతియుతంగానే ఆందోళనను నిరసన తెలుపుతున్నామని అన్నారు.నో ఒప్పుకోం అంటు వారిని బలవంతంగ జీపులో పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అంత అంతకుముందు ఎస్.ఐ ముందస్తు చర్యల్లో భాగంగ జలదంకిలో బారీ పోలీసుబందోబస్తు ఏర్పాటుచేసి అన్నికూడళ్ళలో పోలీసులను మోహరించారు. పలువురు ముఖ్యనేతలను ఆయాగ్రామాలలో హౌస్ అరెస్ట్ అరెస్ట్‌చేశారు.అయినప్పటికి పోలీస్ అంచనాలను తలక్రిందులుచేస్తూ మధురెడ్డి ఆధ్వర్యంలో నిరసన జరగడం గమనార్హం.

## చంద్రబాబునాయుడు అరెస్ట్ అప్రజాస్వామ్యం



**జలదంకి, సెప్టంబర్9, ప్రభాతవార్త:**తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అరెస్ట్ అప్రజాస్వామ్యంమని తెలుగుదేశంపార్టీ ఉదయగిరి నియోజకవర్గ టి.డి.పినేత,మాజీ జిల్లాపరిషత్ చైర్మన్ చెంచలబాబు యాదవ్ అన్నారు.శనివారం పార్టీ మండలనేతలనుఅరెస్ట్ చేశారన్న సమాచారంతో ఆయన జలదంకికి విచ్చేశారు.పోలీస్‌స్టేషన్‌లో నేతలను పరామర్శించారు.అనంతరం స్టేషన్ వెలుపల మీడియాతో మాట్లాడారు.ఇది చీకటిదినంగ అభివర్ణించారు.సుదీర్ఘరాజకీయ అనుభవం కలిగి పద్నాగేళ్ళు ముఖ్యమంత్రిగ చేసిన చంద్రబాబునాయుడ్ని అక్రమంగ ఎటువంటి ఆదారాలు లేకుండ నోటీసులు కూడా ఇవ్వకుండా అర్ధరాత్రివేళ అరుస్టు చేయడం సిగ్గుచేటని అన్నారు. మచ్చలేని మాజీ ముఖ్యమంత్రిపై సి.ఎం జగన్ కక్షకట్టి ఈచర్యకు పాల్పడ్డాడని మండిపడ్డారు.ఇది జగన్‌మోహన్‌రెడ్డి పతనానికి నాందని అంతిమంగ న్యాయమే గెలుస్తుందని ఈప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఆయన జోష్యం చెప్పారు. దుత్తలూరులో మాజీ ఎంపిపి రవీంద్రబాబును అరెస్ట్‌చేసిన సందర్భంలో నానావిధాలుగ దుర్భాషలాడడం సి.ఐ తనపరిధిని దాతాడని చెంచల్‌బాబు తప్పుబట్టారు.ఈవైఖరిని సి.ఐ విడనాడాలని లేదంటే భవిష్యత్తులో తీవ్రపరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని అన్నారు.ప్రజాస్వామ్యంలో నిరసన చేపట్టడం సర్వసాదారణమని దానికి అన్‌పార్తమెంటరి లాంగ్వేజ్ వాడడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

## నారా చంద్రబాబునాయుడుని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణం



**కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబా బు నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణమని కావలి టిడిపి నేతలు విమర్శించారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా కావలి పట్టణంలోని ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో శనివారం టిడిపి నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న అధిక సంఖ్యలో పోలీసులు అక్కడికి చేరుకొని వెళ్లిపోవాలని కోరారు. కొందరు టిడిపి నేతలు అక్కడే కూర్చోవడంతో కావలి డిఎస్పీ వెంకట రమణ, టు టౌన్ సిఐ సుధాకర్‌లు తమ సిబ్బందితో చేరుకొని టిడిపి నేతలను చెదరగొట్టారు. టిడిపి నేతలు కావలి 31వ వార్డు ఇన్‌చార్జ్ మంచాల ప్రసాద్, కోటయ్య, వెంకటేశ్వర్లు తదితరులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై పెట్టిన కేసులు కేవలం కక్ష సాధింపు మాత్రమేనన్నారు. ఈ కేసులు గత 23 సంవత్సరాల కాలానివని ఎ1,ఎ2ల సంబంధించిన కోర్టు తీర్పు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. చంద్రబాబునాయుడు పేరు చార్జ్‌షీట్‌లో లేకపోయినా కూడా కక్ష సాధింపుతో అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. దీనిని తెలుగుదేశం పట్టణ కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసిపి పాలనకు త్వరలో ప్రజలు చరమగీతం పాడుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ మస్తాన్, ఆత్మకూరి నాగరాజు, మంచాల ప్రసాద్, తటవర్తి వాసు, గుండ్లపల్లి శివాజీ, అక్కలిగుంట సూర్యప్రకాష్, వెంకటేశ్వర్లు, వడ్లమూడి కొండపనాయుడు, కోటయ్య,అబ్దుల్ రహీం, కోటా రమేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి మండవ వెంకట్రావు ఆధ్వర్యంలో దివ్యాంగులు ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించగా వారిని అదుపులోకి తీసుకొని కావలి టు టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి శ్రేణులు ఆందోళన



కలిగిరి **సెప్టెంబర్ 9,ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు ను సిఐడిఅధికారులు అరెస్ట్‌చేసినందుకు నిరసనగా టిడిపి నిరసనలు చేపట్టగా కలిగిరి పోలీసులు శనివారం అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించి అనంతరం వదిలేసిన వదిలేశారు.స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు నాయుడును సిఐడి అధికారులు అరెస్ట్‌చేశారు.విషయం తెలుగుదేశంపార్టీ నాయకులు తమ అదినేతకు జరిగిన అన్యాయంపై ఆందోలనతో పార్టీకార్యాలయంలో నిరసనలు చేపట్టారు. దీనితో కిందరు రోడ్డుపైకి వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసలులు అడ్డుకొని అరెస్ట్‌చేశారు.

**చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామ్యం;**40సంవత్సరాల రాజకీయజీవితంలో ఎలాంటి తప్పుచేయని తమ నేత నారాచంద్రబాబునాయుడును అరెస్ట్‌చేయడం అత్యంత హేయమైన చర్యఅని ఉదయగిరి టిడిపి ఇన్చార్ బొలినేని వెంకట రామారావు తెలిపారు. శనివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ బాబు నంద్యాల పర్యటనలో ఉండగాపోలీసులు అర్ధరాత్రి హడాఉడి సృష్టించి తమ నేతను అరెస్ట్‌చేశారని ఆయన ఆరోపించారు.ఇలాంటి పరిస్తితులు సృష్టిస్తే బయపడేవారు ఎవరులేరనే విషయం వైసిపినాయకులు గుర్తించుకోవాలన్నారు.

**చంద్రబాబు అరెస్ట్ బాదాకరం;**14 సంవత్సరాలు ముఖ్యమంత్రి చేసిన నారాచంద్రబాబునాయుడును అరెస్ట చేయడం అత్యంత బాదాకరమని బిజెపి పార్టీ రాష్ట్రకౌన్సిల్ సబ్యులు నందనవనం ప్రబాకర్‌రావు తెలిపారు. చంద్రబాబుఅరెస్ట్‌కు నిరసనగా వారు కలిగిరి తాసిల్దారు కార్యాలయం ఎదుట బిజెపి శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు.

## అల్లూరులో తెలుగుదేశం పార్టీ నేతలు అరెస్ట్



**అల్లూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా శనివారం అల్లూరు మండల తెలుగుదేశం పార్టీ శ్రేణులు బీద గిరిధర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా అల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు నల్లజెండాలు, తెలుగుదేశం జెండాలు చేతపట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహిస్తుండగా పోలీసులు నిరసన వ్యక్తం చేసేందుకు వీలులేదని అడ్డుకున్నారు. టిడిపి సీనియర్ నేత బీద గిరిధర్, బుర్లా కృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టిడిపి శ్రేణులు ర్యాలీగా పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా బీద గిరిధర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడుని 70 సంవత్సరాలు వయసు వున్నా పోలీసులు కనికరించకుండా అక్రమ కేసులు బనాయించి అర్ధరాత్రి అరెస్ట్ చేయడం దారుణమన్నారు. చంద్రబాబును విడుదల చేసేంత వరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఎంతదూరమైనా పోరాడతామని హెచ్చరించారు.చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై నిరసన చేస్తుంటే పోలీసులు నిరసన కూడా చేయకూడదని మమ్మల్ని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. వైసిపి నాయకులు ఎన్నో సార్లు మా అధినేతపై అక్రమ కేసులు పెట్టాలని చూసినా వీలుపడక నేడు అక్రమంగా అరెస్ట్ చేశారని తెలిపారు. రాష్ట్రంలో సైకో పాలన నడుస్తుందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అల్లూరు మండల అధ్యక్షులు బండి శ్రీనివాసులరెడ్డి, అలగర రమణయ్య, కావలి వెంకట రమణయ్య, నజీర్‌బాషా,రామిశెట్టి కృష్ణచైతన్య, అంబటి రాజేంద్ర, కోట శ్రీహరి, రామకృష్ణ, వేగూరు శ్రీనివాసులు, చెంతాటి రాజశేఖర్‌బాబు, అల్లూరు మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ సియం జగన్ దిష్టిబొమ్మ దహనం

**కావలి రూరల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా కావలి రూరల్ మండలం తుమ్మలపెంట సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి నేతలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను శనివారం దగ్ధం చేశారు. కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆదేశాల మేరకు కావలి రూరల్ మండల టిడిపి అధ్యక్షులు ఆవుల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సియం జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సియం జగన్మోహన్‌రెడ్డి చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట పంచాయతీ టిడిపి అధ్యక్షులు మస్తాన్, ప్రధాన కార్యదర్శి యం.యస్.గౌడ్, యూనిట్ ఇన్‌చార్జ్ కనకయ్య, తిరుపతి, వెంకయ్య, వాయిల సురేష్, సుబ్బయ్య, జెడ్డా రాజశేఖర్, చిట్టిబాబు, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసుల కళ్ళుగప్పి నల్లజెండాతో నిరసన తెలిపిన టిడిపి నేత ఏగూరు

**కావలి రూరల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా శనివారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏగూరు చంద్రశేఖర్ కావలి పట్టణంలో పోలీసులు పహరా కాస్తున్నా వారి కళ్లుగప్పి స్థానిక ఎయం బేకరీ సెంటర్‌లో వున్న ఎన్టీఆర్ విగ్రహానికి నల్లజెండా కట్టి నిరసన తెలిపారు. జై చంద్రబాబు అంటూ నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది. గతంలో కూడా పోలీసులు పట్టణంలో నిరసనలకు అనుమతి ఇవ్వకుంటే బుర్ఖా ధరించి పోలీసులు కంటపడకుండా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం వుంచారు. ఈసారి మరలా కూడా ఆయన పోలీసుల కళ్లుగప్పి నిరసన వ్యక్తం చేయడం గమనార్హం,

## చంద్రబాబుని అరెస్టు చేయడం దుర్మార్గం

**నెల్లూరు సెప్టెంబర్ 9, ప్రభాతవార్త-వైద్యం** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఎఫ్ఐఆర్ లేకుండా అరెస్టు చేయడం దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ నాయకుడు డాక్టర్ ధర్మవరం గణేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం చంద్రబాబునాయుడుని అరెస్టు చేసిన సందర్భంగా నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం వద్ద చంద్రబాబు అరెస్టుని తీవ్రంగా ఖండిస్తూ నిసనర కార్యక్రమాన్ని 42, 43, 47, 48, 49 డివిజన్ల నాయకులు, కార్యకర్తలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసు నమోదు చేయకుండా, అరెస్టుకు ఎలాంటి ఆధారాలు చూపకుండా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో జగన్ ఆధ్వర్యంలో రాక్షసరాజ్యం రాజ్యమేలుతోందని విమర్శించారు. ఒక మాజీ ముఖ్యమంత్రికే ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్రం ఆర్ధికంగా అప్పుల్లో కూరుకుపోయిందని, దాంతోపాటు దోపిడీ, దౌర్జన్యాలు పెరిగిపోయాయని వారు మండిపడ్డారు.

## వైభవంగా స్వామివారికి అభిషేక పూజలు



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** : కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అత్యంత వైభవంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా సీహెచ్ శివభాస్కర్‌రావు, ఎం. వెంకట సురేంద్ర, డి. వెంకటేశ్వర్లురెడ్డి, పి. ఫణి కుమార్‌రెడ్డి, ఎన్. శివకుమార్, పి. లక్ష్మణ్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. రుత్వికులు పరాంకుశం శ్రీనివాసాచార్యులు, శ్రీకాంతా చార్యులు, నాగరాజా చార్యులు, ప్రసాద్ స్వామి, నందకుమార్ స్వామి, తదితరులు ఉన్నారు.

## చంద్రబాబుని అరెస్టు చేయడం హేయం

**నెల్లూరు సెప్టెంబర్ 8, ప్రభాతవార్త-వైద్యం** టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుని అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో పనబాక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంటులో ఎలాంటి అవినీతి జరగలేదని కోర్టు తెలిపిందని, 2021లో ఇది జరిగితే అప్పటి నుంచి ఇప్పటి వరకు దానిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చెయ్యకుండా ఇప్పటి వరకు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. టీడీపీ, చంద్రబాబు, లోకేష్‌కు వస్తున్న ప్రజా స్పందన చూసే జగన్ ఇదంతా కావాలనే చేస్తున్నాడని ఆమె ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో కుంభకోణం జరిగితే దానిని నిరూపించలేక ఆనాడు పోలీసులు కేసు నమోదు చేయలేకపోయారని భూలక్ష్మి ఆరోపించారు. అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉంటే చంద్రబాబుని అరెస్టు చేసేటప్పుడు ఎఫ్ఐఆర్ కాపీ, ఆధారాలను ఎందుకు పోలీసులు చూపించలేదన్నారు. ఇదంతా జగన్ ఆడుతున్న డ్రామాలలో భాగమేనని ఆమె విమర్శించారు. ఈ నిరసన భారీ సంఖ్యలో మహిళా నేతలు పాల్గొన్నారు.

## అభివృద్ధిని వివరించండి..పార్టీని గెలిపించండి

**తోటపల్లిగూడూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధిని వివరించి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని సచివాలయ కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు విజ్ఞప్తి చేశారు. శనివారం ఇసుకపాలెం సచివాలయంలో పాపిరెడ్డిపాలెం కోవెరపాలెం గ్రామాల నాయకులు వాలంటీర్లు గృహసారధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందే విధంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నియోజకవర్గానికి చేస్తున్న కృషిని గృహసారధుల ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల గృహసారధులు, వాలంటీర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడం దుర్మార్గం

**చేజర్ల, సెప్టెంబర్9, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి , టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును శుక్రవారం రాత్రి నంధ్యాలలో అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అనిచేజర్ల మండల టిడిపి నాయకులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసి అరెస్ట్‌ను ఖండించారు. టిడిపిముఖ్య నేతలను గృహనిర్బంధం చేశారు. టిడిపి నాయకులు బయటకు వెళ్ళకుండా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం టిడిపి సీనియర్ నాయకుడు రావి పెంచలరెడ్డి స్వగృహంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బ్రతికి ఉందా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు 14సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడును అర్ధరాత్రి సిఐడి పోలీసులు అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్యగా తీన్ని తీవ్రంగా ఖండించారు. తప్పుడు కేసులు నమోదు చేసి ప్రతిపక్షనాయకుడిని అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్షపార్టీ నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి అణచివేసే ధోరణి రాష్ట్ర అధికార పార్టీ నాయకులు అవలంభిస్తున్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉద్దేశపూర్వకంగా అరెస్ట్ చేయించారని భవిష్యత్తులో తగినమూల్యం చెల్లించుకొనక తప్పదన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ఇలాంటి పోకడలను విద్యావేత్తలు, మేధావులు, రాజకీయవిశ్లేషకులు , ప్రజాస్వామ్యవాదులు కూడా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని తమ నేత చంద్రబాబు ఏతప్పు చేయలేదని చట్టాలను అడ్డం పెట్టుకొని అరెస్ట్ చేయించారన్నారు. ఎస్సీ సెల్ నాయకులు సోమవరపు హజరత్తయ్య మాట్లాడుతూ ఎపిలో జరుగుతున్న పరిణామాలు అన్నింటిని తెలుగు ప్రజలు గమనిస్తున్నారన్నారు. సరైన సమయంలో వైకాపాకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు , మండలాధ్యక్షుడు రావి లక్ష్మీనరసారెడ్డి, రావికృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గడ్డం వెంకటరమణారెడ్డి, ఉడతాపెంచలయ్య, టిడిపి నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

## నృసింహుని నిత్య అన్న ప్రసాదానికి రూ.50 వేలవిరాళం



**పెంచలకోన(రాపూరు), సెప్టంబరు9ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య అన్నదానానికి శనివారం తిరుపతిజిల్లా వాస్తవ్యులు రూ. 50వేల రూపాయిల విరాళం అందజేశారు. తిరుపతి జిల్లా, గూడరు వాస్తవ్యులుదుర్వెసుల కామేష్ వారి ధర్మ పత్ని వెంకటమంజు ప్రీతి స్వామి వార్లు ముందుగా శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారు శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకోని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్య అన్నదానానికి రాజపోషకులుగా రూ. 50 వేల రూపాయిల విరాళాన్ని ఆలయ సహాయక కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డికి ఆందజేశారు.స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళం అందించిన భక్తులకు స్వామి వారి తీర్ధ ప్రసాదాలను,చిత్రపఠాన్ని ఆలయ సిబ్బంది ఆందజేశారు.

## నృసింహుని నిత్య అన్న ప్రసాదానికి రూ.1 లక్ష విరాళం



**పెంచలకోన(రాపూరు), సెప్టంబరు9ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెను శిల లక్ష్మీనరసింహ స్వామి వారి నిత్య అన్న దా నానికి శనివారం కడపజిల్లా వాస్తవ్యులు రూ. 1 లక్షల రూపాయిల విరాళం అందజేశారు. కడప జిల్లా,చిట్వేలి వాస్తవ్యులు నరిశెట్టి లక్ష్మీ సాత్వీక్ అను స్వామి వారి భక్తుడు ముందుగా శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి, శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారుశ్రీ ఆదిలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకోని పూజలు నిర్వహించారు. స్వామి వారి నిత్య అన్నదానానికి మహారాజపోషకులుగా రూ. 1లక్ష రూపాయిల విరాళాన్ని ఆలయ సహాయక కమీషనర్ కోవూరు జనార్ధన్ రెడ్డికి ఆందజేశారు.స్వామి వారి నిత్య అన్నదానానికి విరాళం అందించిన భక్తులకు స్వామి వారి తీర్ధ ప్రసాదాలను,చిత్రపఠాన్ని ఆలయ సిబ్బంది ఆందజేశారు.

## రాపూరుకు ఎస్ఐ నియామకం ఎప్పుడో



**రాపూరు, సెప్టంబరు9ప్రభాతవార్త** పాత నియోజకవర్గ కేంద్రంగా, ప్రస్తుతం సర్కిల్ కేంద్రంగా వున్న రాపూరు పోలీస్ స్టేషన్‌లో సుమారుగా30 రోజుల నుండి ఎస్ఐ పోస్టు ఖాళీగా వుంది. గతంలో రాపూరు పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు ఎస్ఐలు వుండేవారు. ఏడాది క్రింతం ఇక్కడ వున్న మహిళా ఎస్ఐను మరో ఎస్ఐను బదిలి చేసి ఒక్క ఎస్ఐను మాత్రమే ఇక్కడ నియమించారు.రెండు నెలల క్రింతం రాపూరు స్టేషన్‌లో వున్న ఎస్ఐ కాంతికుమార్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో రంగనాద్ గౌడ్‌ను నియమించారు. ఎస్ఐ రంగనాథ్ గౌడ్‌ను ఇక్కడి నుండి ఒక్క నెలలోనే అంటే ఆగష్టు నెలలో బదిలీ చేశారు.అప్పటి నుండి రాపూరు స్టేషన్‌లో ఎస్ఐ లేక వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రాపూరుకు ఎస్ఐను వెంటనే నియమించాలని మండలంలోని ప్రజలుకోరుతున్నారు.

## వాడకుప్ప కిష్టయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** ఇటీవల బిట్రగుంటలో హత్యకు వాడకుప్ప కిష్టయ్య కుటుంబాన్ని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు. బిట్రగుంటలో వాడకుప్ప కిష్టయ్య, వాడ కుప్ప మౌనిక,అంటిశాంతమ్మ వీరు ముగ్గురు హత్య గురైన విషయం విధితమే. వారు రెడ్డిపాళెంకి చెందిన వారు కాగా వారు బుచ్చిరెడ్డిపాళెం శేషాద్రినగర్‌లో నివాసం ఉంటుండగా వారి నివాసానికి వెళ్ళి వాడకుప్ప పద్మమ్మను పరామర్శించారు.ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి ఉన్నారు.

## కావలి తెలుగుదేశం పార్టీ నేతలు పలువురు హౌస్ అరెస్ట్



కావలి, **సెప్టెంబరు 9 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్ట్ చేయడంతో ముందస్తుగా కావలి తెలుగుదేశం పార్టీ నేతలను శనివారం తెల్ల వారుజామున హౌస్ అరెస్ట్ చేశారు. నెల్లూరులో కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడుని ఆయన నివాసంలో పోలీస్ హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మాలేపాటి మా ట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుని అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజా స్వామిక చర్య అన్నారు. ఆయనను అరెస్ట్ చేస్తే ఊరుకోవాలా అని పోలీసులను ప్రశ్నించారు. అరెస్టులకు భయపడేది లేదని ఏ చట్టంలో నన్ను నిర్బంధించారో తెలియజేయాలని పోలీసులను నిలదీశారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై శాంతియుతంగా నిరసన తెలియజేయడం కూడా తప్పా అన్నారు. ఇదెక్కడి న్యాయం, ఇదెక్కడి ధర్మమన్నారు. వైసిపి ప్రభుత్వ దుర్మార్గపు పాలనను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. బయ టకు వెళ్లేది ఖాయమని పోలీసులకు ఆయన తేల్చి చెప్పారు. దగదర్తిలో మాలేపాటి సుబ్బానాయుడు అన్న ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చూసేందుకు ఇంటి నుండి బయటకు వస్తున్న మాలేపాటిని గృహ నిర్బంధం చేశారు. కావలి పట్టణంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొగిలి కల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, పోతుగంటి శ్రీకాంత్, జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరినాయుడు, ఆయన కుమారుడు శశిధర్‌నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు,టిడిపి సీనియర్ నాయకులు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, మాజీ కౌన్సిలర్ కుందుర్తి కిరణ్‌కుమార్, కావలి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దావులూరి దేవకుమార్, మరికొంతమంది నేతలను కావలి పట్టణ, రూరల్ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు.

## గురివిందపూడిలో మాతమ్మ తిరునాళ్ళు



**మనుబోలు,సెప్టంబర్9,ప్రభాతవార్త:** మండలంలోని గురివింద పూడిలో మాతాపరమేశ్వరి ఉత్సవాలు ఘనంగ నిర్వహి సు న్నారు.మాతాపరమే శ్వరిదేవి మూడవ వార్షికోత్సవ ఉత్స వాలు ఈనెల 6వతేది నుండి ప్రారం భించారు.11వతేదీతో ముగు స్తా యని పూజారి శ్రీహరి తెలిపారు. ఈసందర్భంగ అరుంధతి వా డలో మాతాప రామేశ్వరిదేవి దేవాలయాన్ని అన్నివీధులలో విద్యు త్‌దీపాలతో ముస్తాబుచేశారు.కొమ్ము తప్పెట్లు, బాణా సంచా శబ్దాలతో గ్రామం సందడిగ తిరునాళ్ళు జరు గుతున్నాయి. ఈకా ర్యక్రమానికి శుక్రవారం రాత్రి మాజీ మంత్రివర్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి విచ్చేశారు.టి .డి.పి నాయకులు చెన్నూరు సుదీ ర్‌రెడ్డి,సర్వేపల్లి శివకుమా ర్,మో మిడి ప్రసాద్‌సోమిరెడ్డికి ఘన స్వాగతం పలికారు .నేరు గ ఆయన మాతమ్మ దేవస్తానానికివెళ్ళి అమ్మవారిని దర్శించు కున్నారు.ఆయనవెంట పార్టీనాయకులు పొన్నూరురామ కృష్ణ య్య,మధు నాయు డు,సూరిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కక్షిదారులు కేసుల పరిష్కారానికి కోర్టు చుట్టూ తిరుగుతూ విలువైన కాలాన్ని వృథా చేసుకోకుండా రాజీకి వీలుపడే కేసులన్నింటినీ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ బి. లక్ష్మీనారాయణ అన్నారు. కోవూరులోని సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యే కేసులన్నింటికీ పూర్తిస్థాయిలో చట్టభద్రత ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కక్షిదారులు ఈ లోక్ అదాలత్ సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. కాత్యాయని పలు సూచనలు చేశారు. లోక్ అదాలత్ సభ్యులుగా న్యాయవాదులు రాంబాబు, ఏ. చెన్నయ్యలు వ్యవ హరించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం క్రిమినల్ కేసులు 2152, సివిల్ కేసులు 3, బ్యాంకులు, బీఎస్ఎ న్ఎల్‌కు సంబంధించి 90 కేసులు పరిష్కారం కాగా దీనికి సంబంధించిన మొత్తం 25 లక్షలు సెటిల్‌మెంట్ కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసులు, తదితరులు ఉన్నారు.

## జాతీయ రహదారిలో టీడీపీ నేతల ధర్నా



కోవూరు, **సెప్టెంబరు 9 ప్రభాతవార్త** : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా శనివారం కోవూరులోని జాతీయ రహదారిపై కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు ధర్నా కార్యక్రమం చపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని , దుర్మార్గంగా రాత్రి వేళల్లో పోలీసులు నానా హంగామా చేసి అరెస్టు చేయడం ఎంతవరకు సబబన్నారు. పాలన చేతకాక సైకో మాదిరిగా ఈ ముఖ్యమంత్రి తయారై పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారన్నారు. అసలు ఎటువంటి మచ్చలేని చంద్రబాబు నాయుడిని ఒక్కరోజు అయినా అరెస్టు చేయాలని చేసిన ప్రయ త్నమే ఈ అక్రమ అరెస్టు అన్నారు. అధినాయకుడు మీద జరిగిన ఈ దాడి రాష్ట్ర భవిష్యత్తు మీద జరిగిన దుర్మార్గమైన దాడిగా అందరూ భావించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో ఎక్కడికక్కడ శాంతియుతంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. జాతీయ రహదారిలో టీడీపీ నేతల ధర్నా కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ ఆగిపోవడంతో రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై రంగనాథ్ గౌడ్, పోలీసు సిబ్బంది భారీ స్థాయిలో మోహరించి నేతలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోవూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు సంబంధించిన నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వైభవంగా అకల్మష హోమాలు



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో పవిత్రోత్స వాల్లో భాగంగా రుత్వికుల పర్యవేక్షణలో అకల్మష హోమం, సప్తదశ కుంభసాధన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయకర్తలతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొ న్నారు. అనంతరం స్వామివారికి పూలంగి సేవ, పల్లకి సేవ, ఊంజల సేవ కార్యక్రమాలను అత్యంత వైభ వంగా చేపట్టారు. రుత్వికులు పరాంకుశం శ్రీనివాసాచార్యులు, శ్రీకాంతాచార్యులు, నాగరాజాచార్యులు, ప్రసాద్ స్వామి, నందకుమార్ స్వామి, తదితరులు ఉన్నారు.

## మెగా లోక్ అదాలత్‌లో 2245 కేసులు పరిష్కారం



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరులోని సివిల్ కోర్టు ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో మొత్తం 2245 కేసులు పరిష్కారం అయ్యాయి. అందులో క్రిమినల్ కేసులు 2182 కాగా.. సివిల్ కేసులు 3, బ్యాంక్, బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించి 90 కేసులు పరిష్కారం కాగా.. దీనికి సంబంధించి 25 లక్షలు సెటిల్‌మెంట్ కావడం జరిగింది. ఈ మెగా లోక్ అదాలత్‌లో బ్యాం కులు, బీఎస్ఎన్ఎల్ ప్రత్యేకంగా లబ్దిదారులతో చర్చించి మొండి కేసులను ఎట్టకేలకు పరిష్కారం చేసుకు న్నారు. ఈ మెగా లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ బి. లక్ష్మీనారాయణ, అడిషనల్ జుడీషియన్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె. కాత్యాయని, సభ్యులు న్యాయవాదులు బి. రాంబాబు, ఏ. చెన్నయ్యలు ఉన్నారు.

## అక్రమ అరెస్టు చేశారంటూ టీడీపీ శ్రేణులు నిరసన



**సైదాపురం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** టీడీపీ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని సీఐడీ అక్రమంగా అరెస్టు చేశారంటూ మండల టీడీపీ శ్రేణులు శనివారం నిరసన తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్య నాయుడు, కృష్ణమూర్తి, కేపీ రాజు,దశయ్యనాయుడు, మస్తాన్‌నాయుడు, కిరణ్‌కుమార్, రమేష్‌బాబు, కోటయ్య, పాల్గొన్నారు.

## అక్రమ తెల్లరాయి వెలికితీస్తున్న యంత్రాలు స్వాధీనం




**సైదాపురం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** మం డల పరిధిలోని పాలూరు గ్రామ సమీపంలో ఉ న్న ప్రభుత్వ భూముల్లో యంత్రాల సహా యంతో అక్రమ తెల్లరాయి తవ్వకాలు తవ్వే యంత్రాలను సైదాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై చల్లా వాసు మాట్లాడుతూ మండల పరిధిలోని పా లూరు గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూ ముల్లో తెల్లరాయిని యంత్రాలతో వెలికి తీస్తు న్న సమయంలో గ్రామ వీఆర్వో 200ఇటాచి మిషన్, టిప్పర్‌ను పట్టుకుని తమకు సమా చారం అందించడంతో వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని యంత్రాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

## చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి పెద్దఎత్తున నిరసన

**కందుకూరు,సెప్టెంబర్9,ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వరనయంలో కందుకూరులో మధ్యాహ్నం నిరసన కార్యక్రమం జరిగింది.అధిక సంఖ్యలో కార్యకర్తలు ,అభిమా ను లు,మహిళలు వెంటరాగా నాగేశ్వరరావు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పామూరు రోడ్డు జంక్షన్ వద్దకు ర్యాలీగా చేరుకోగానే పోలీసులు పార్టీ శ్రేణులను అడ్డుకున్నారు.ఉదయం నిరసనకు అనుమతి ఇచ్చామని,ఇప్పుడు అనుమతి ఇవ్వలేమని పోలీసులు చెప్పడంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.తమ నాయకుడిని అన్యాయంగా అరెస్టు చేస్తే కనీసం నిరసన తెలిపే హక్కు కూడా లేదని ప్రశ్నించా రు.అయి నప్పటికి పోలీసులు ఒప్పుకోకపోవడంతో వారిని నెట్టుకుంటూ కార్యకర్తలు ముందుకు నడిచారు.సీఎం డౌన్,డౌన్ చంద్రబాబును విడుదల చేయాలని నినాదాలతో హోరెత్తిస్తూ ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు.అక్కడి నుండి అంబేద్కర్ విగ్రహం వైపు వెళ్తున్న ర్యాలీని పోలీసులు బలవంతంగా అడ్డుకుని ఆపేశారు. దీంతో మరోసారి పోలీసులకు,పార్టీ నేతలకు వాగ్వాదం జరిగింది.పోలీసుల వైఖరిని నిరసిస్తూ పార్టీ శ్రేణులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద బయట నుంచి నిరసన కొనసాగించారు.దాదాపు గంటన్నర సేపు నిరసన తెలిపిన అనంతరం తిరిగి ర్యాలీగా పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఏ తప్పు చేయకపోయినా కుట్ర చేసి అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.బాబుగారిని ఒక్కరోజైనా జైలులో కూర్చోబెట్టాలని జగన్మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా కుట్రలు చేస్తూనే ఉన్నారిన, అప్పటి నుండి ఏమీ చేయలేక మరోసారి అరెస్టు డ్రామాకు తెర తీశారని అన్నారు. ఇలాంటి సైకో ముఖ్యమంత్రి ఉండటం మన దౌర్భాగ్యమని చంద్రబాబు నాయుడుని వెంటనే విడుదల చేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

## ఆందోళన కార్యక్రమంలో ఇంటూరి రాజేష్ అరెస్టు

**కందుకూరు,సెప్టెంబర్9,ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి,తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా కందుకూరు నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లు వీదికెక్కారు.ఇందులో భాగంగా పోలీసులు శనివారం వేకువజాము నుంచే నేతలను,కార్యకర్తలను గృహనిర్బందిం చారు.వలేటి వారి పాలెం మండలం బడేవారిపాలెంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్‌ను అదుపులోకి తీసుకుని గృహనిర్బదించారు,సమీపంలో ఉన్న కందుకూరు టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావునుకూడా గృహనిర్బదించడం జరిగింది.అయితే ఇంటూరి రాజేష్ ఇంటూరి రాజేష్ ఇంటిదగ్గర నుండి తప్పించుకుని వచ్చి 7కిలో మీటర్లు బైక్‌పై వచ్చి కందుకూరులోని పామూరు రోడ్డులో ఉన్న ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద నిరసనకు దిగారు.ఆయన వర్గీయులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు.పోలీసులు రాజేష్‌ను అరెస్టు చేసి తీసుకుని వెళ్లారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యం మత్తులో మెడికో విద్యార్థి వీరంగం



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ పరిధిలో నారాయణ మెడికల్ కాలేజీకి సమీపాన శుక్రవారం అర్ధరాత్రి సమయాన ఐదో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న చైతన్య కార్తీక్ అనే విద్యార్థి మద్యం మత్తులో మితిమీరిన వేగంతో కారు నడుపుతూ ఒక ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులందరూ కూడా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నట్లు పోలీసుల సమాచారం. కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు ఢీకొన్న వాహనంతో పాటు దెబ్బతిన్న ఆటోను కూడా స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కేసును మాఫీ చేసి మెడికో విద్యార్థిని ఎలాగైనా కాపాడాలని కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు ప్రయత్నిస్తున్నట్లు సంక్షిప్త సమాచారం.

## నిబంధనల మేరకే చంద్రబాబు అరెస్టు



**నెల్లూరు సిటీ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** నిబంధనలను అనుసరించి చట్టప్రకారమే టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని అరెస్టు చేశారని వెంకటగిరి నియోజ కవర్గ ఇన్‌ఛార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తెలిపారు. పొద లకూరు రోడ్డులోని కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పా టు చేశారు. ఈసందర్భంగా రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రూ.370 కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలతో మాజీ ము ఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు కావడంపై టీడీపీ శ్రేణులు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. ఎందుకు అరెస్టు చేశారో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నిరు ద్యోగ యువతకు శిక్షణ ఉపాధికి సంబంధించి అంశంపై ఒప్పందం కుదిరిందని, ప్రతి ఒక్కరూ సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేశారు. పథకం అమలువుతున్న సమయంలో కోట్ల రూపాయల స్కాం బయటపడిందన్నారు. అజెండాలో లేనప్పటికి క్యాబినెట్లో వందల కోట్ల రూపాయలకు సంబంధించిన నిధులను మూడు నెలల్లోనే విడుదల చేశారని తెలి పారు. 90శాతం కేంద్ర నిధులు విడుదల కాకముందే రాష్ట్ర వాటా నిధులను నామమాత్రపు ఖర్చు చేశార న్నారు. షెల్ కంపెనీని అడ్డం పెట్టుకొని నిధులను దారి మళ్లించారన్నారు. జీఎస్టీ సైతం తప్పించుకునే ప్రయ త్నం జరిగిందన్నారు. కళాశాల అధినేతగా తనకు విషయంపై కొంత అవగాహన ఉందన్నారు. ప్రజాధనాన్ని హవాలా చేసి అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టాలా అని ప్రశ్నించారు. న్యాయస్థానం విచారణ చేపట్టి నిజనిజాలు బయట పెడుతుందన్నారు. ఎలక్షన్స్ సమీపిస్తుండటంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని టీడీపీ నేతలు అసత్యప్రచారాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబునాయుడు అరెస్టు సీఐడీ తీసుకొనే నిర్ణయం అని, ప్రభుత్వానికి ఏ విధమైన సంబంధం లేదని తెలిపారు. కోర్టులో పోరాడే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ఉంటుందని గుర్తు చేశారు. ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ తరుపున వెంటగిరిలో పోటీ చేస్తే తాము స్వాగతిస్తామన్నారు. ఆనం ఎక్కడ పోటీ చేసినా ఓటమి ఖాయమని తెలిపారు. కుటుంబ సభ్యులుగా వ్యవహరిస్తున్న వాలంటీర్లపై వ్యతిరేక వ్యాఖ్యలు సరికాదన్నారు. వైనాట్ 175 నినాదంతో వైసీపీ ముందుకు వెళ్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయమని తేల్చిచెప్పారు.

## 27వ డివిజన్లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ



**నెల్లూరు సిటీ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** నెల్లూరు నియోజకవర్గంలోని 20వ మున్సి పల్ కార్పొరేషన్ డివిజన్లో ఆర్‌టీఓ ఆఫీసు రో డ్డు నుడా పార్క్‌కి సమీపంలోని షార్ కాలనీ అభివృద్ధిలో భాగంగా రోడ్డు నిర్మాణ పనులకు శనివారం నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదా ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూర ల్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు తన వంతు బాధ్యతగా కృషి చేస్తామన్నారు. 20వ డివిజన్లో ఇప్పటి వరకు ఆరు కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందని, అదే విధంగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం మరో కోటి రూపాయలు కేటాయిస్తామని తెలిపారు. స్థానిక నాయకులతో చర్చించి ఎక్కడ అభివృద్ధి పనులు అత్యవసరం అవుతాయో వాటిని గుర్తించి వెంటనే పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతనంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలో లేఅవుట్‌లకు ఖచ్చితంగా రోడ్లు, సైడు కాలువలు ఏర్పాటు చేస్తేనే అనుమతులు ఇవ్వాలని, కార్పొరేషన్ అధికారులను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. రూరల్ అభివృద్ధి సంక్షేమం రెండు కూడా సమాన ప్రాతిపదికన నెల్లూరు రూరల్ నియోజ కవర్గంలో వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 20వ డివిజన్ నేతలు, పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, మల్లు సుధాకర్‌రెడ్డి, పాలకీర్తి రవికుమార్, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీ నిర్మాణ పనులకు శిలాఫలకం



**నెల్లూరు సిటీ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** నెల్లూరు రూలర్ మండలం కొమ్మరపూడి గ్రామంలో నవరత్నాలు- పేదలందరికి ఇళ్ల వైఎస్సార్ జగనన్న కాలనీ నిర్మాణంలో భాగంగా జిల్లా పరి షత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి ములుముడి- కొమ్మలపూడి గ్రా మానికి సంబంధించిన ఫేస్- 2 నిర్మా ణంలో భాగంగా రూ.111.60 లక్షల రూపాయల అంచనా వ్యయంతో జగన న్న కాలనీ నిర్మాణ పనులకు నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి శిలా ఫలకాన్ని ఆవిష్కరించి భూమిపూజ చేశారు. అనంతరం ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాల య వ్యవస్థ ద్వారాప్రజలకు అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగకుండా వాలంటీర్ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తు న్నాయన్నారు. జగనన్న కాలనీ నిర్మాణంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలం ఇవ్వడం జరుగుతుందని ఎంపీ ఆదాల స్పష్టం చేశారు. తదుపరి కొమ్మరపూడి గ్రామంలో రక్షిత మంచినీటి వాటర్ ప్లాంట్‌ను ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ బూడిత విజయకుమార్, మండల జేసీఎస్ నాయకులు సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, మల్లు సుధాకర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌ఛార్జి మొయిల్లా సురేష్‌రెడ్డి, పాలకీర్తి రవికుమార్, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, మూలే విజయభాస్కర్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు సయ్యద్ మొబీన, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## పోలీసుల వలయంలో టీడీపీ నేతలు



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు అనంతరం తెల్లవారుజాము నుంచే నెల్లూరు జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఉండేందుకు ముందస్తుగానే ఎక్కడికక్కడ టీడీపీ నేతలను గృహనిర్బంధం చేశారు. పోలీసులు, నగరంలోని రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇంటి వద్ద తెల్లవారుజామున పోలీసులకు టీడీపీ కార్యకర్తలకు మధ్య ఒకంత వాదోపవాదాలు జరిగినప్పటికి అనంతరం ఎటువంటి ఘర్షణలు జరగకుండా నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దర్గామిట్ట పోలీసులు వ్యవహరించారు. అదే విధంగా నగరంలోని ఆరు పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి టీడీపీ నేతలను ఇంటి బయటకు వచ్చి ఎటువంటి ఉద్రిక్త చర్యల కు పాల్పడతారోనని ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా నోటీసులు అందించారు. నెల్లూరు నగరం మొత్తం కూడా పోలీసుల ఆలయంలో ఎక్కడికక్కడ టీడీపీ నేతలను, కార్యకర్తలను అదుపు చేయడంలో పోలీసులు కృషి అభినందనీయం.

## న్యాయవాదులు ధర్నా



**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త** మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా నెల్లూరు నగరంలోని టీడీపీ సానుభూతిపరులైన న్యాయవాదులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం టీడీపీ పార్టీ పైన ఉన్న కక్షతోనే ఈ అరెస్టుల పర్వం కొనసాగిందని ఎద్దేవ చేశారు. ప్రజాస్వామ్యాన్ని హరించడమే లక్ష్యంగా పెట్టుకున్న వైసీపీ ప్రభుత్వం ఇలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతుందని, ఇవి ఇలాగే కొనసాగితే ప్రజలు అందరూ కూడా 2024వ సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీని మట్టికరిపించడం ఖాయమని హెచ్చరించారు.